# జనపథం - జనపదం

# ఉత్తరదక్షిణ(ము)లు

- నిత్యానంద్.

"అసలేంటండి? ఉత్తరదక్షిణములు అంటున్నారు!" అని మీరు అడగాలని అనుకుంటున్నారని నాకు తెలుసు. అందుకే ఉపోద్ఘాతము ఉటంకించకుండా అసలు విషయానికే వచ్చేస్తున్నాను. ఉత్తరదక్షిణ(ము)లు అనేవి ప్రతి వ్యక్తికీ అవసరం, అది కృతయుగమైనా, త్రేతాయుగమైనా, ద్వాపరమైనా, కలి యుగమైనా! కాకపోతే వాటి అర్థాలు కాలగమనంలో కాస్తంత మారుతున్నాయి. మార్పు కాలానుగుణంగా జరగకపోతే విపత్తు ముంచుకొస్తున్నట్లే. ఉదాహరణకి మన తాతల కాలానికి, నేటికి పోల్చి చూస్తే ఎన్నో తేడాలు కనిపిస్తాయి. అప్పటి పరిస్థితికి ఆ న్యాయం, ఇప్పటి పరిస్థితులకి ఈ న్యాయం - రెండూ సరియైనవే. ఇంతకీ ఉత్తర, దక్షిణములు దిక్కులు - మన జీవన గమనాన్ని నిర్దేశిస్తాయని వాస్తుశాస్త్రము, జ్యోతిషశాస్త్రము వక్కానిస్తున్నాయి. 'దశ బాగుంటే దిశ ఏమిచేస్తుందని' ఓ అనుభవజ్ఞుని మాట. అయితే ఎవరి నమ్మకాలు వారివనుకోండి. ధ్వని వేగాన్ని అధిగమించి, అంతరిక్ష నౌకలను అలవోకగా గగనానికి పంపుతున్న ఈ రోజులలో కూడా తిధి, వార నక్షత్రములను తిలకించి మరీ ఈ ప్రయత్నానికి శ్రీకారం చుడుతున్నారని హేళన చేసేవాళ్ళూ లేకపోలేదు. అయితే తిధి, వార నక్షత్రములను గణించి, ఏ గ్రహస్థితి ఏమిటో, ఏ గ్రహ ప్రభావం భూమి మీద ఉంటుందో, వాతావరణములో మార్పులు, మొదలైన విషయములు నిర్ధారించే శాస్త్రమే జ్యోతిషశాస్త్రము కదా! అంటే అది విజ్ఞాన శాస్త్రానికి సమాంతరముగా మరో శాస్త్రము.

ఉత్తర, దక్షిణ ధృవాలంటే అవి ఆకర్షణకు ప్రతీకలుగా మనకి తెలుసు. ఉత్తరమువైపు తలపెట్టుకుని పడుకోవద్దని పెద్దల ఉవాచ. ఇద్దరు వ్యక్తుల ప్రవర్తన పూర్తి భిన్నముగా ఉంటే, వారిని ఉత్తర దక్షిణ ధృవములతో పోల్చడం పరిపాటి. కాని నిజానికి మనము చదువుకున్న "విజాతి ధృవములు ఆకర్షించుకొనును. సజాతి ధృవములు వికర్షించుకొనును." అనే సిద్ధాంతము అయస్కాంతము వరకే పరిమితము. ఒకే రకమైన అభిరుచి కలవారు మిత్రులయ్యే అవకాశము ఎక్కువ. అది దీర్ఘకాలము సాగుతుంది కూడా. కాబట్టి సజాతి ధృవములు ఆకర్షించుకుంటాయన్నది జీవుల విషయములో వాస్తవం.

పైన చెప్పిన ఉత్తర, దక్షిణాలకి అతీతంగా వేరొక ఉత్తర, దక్షిణాలున్నాయి. ఉత్తరమనగా లేఖ (Recommendation Letter), దక్షిణమనగా కార్యసాధనకి చెల్లించే అదనపు మూల్యం (అమ్మో! లంచం అంటే నొచ్చుకుంటారు. అందుకే ప్రయివేటు సంస్థలకి ఫీజుగా ప్రభుత్వమే నిర్ధారించింది). ఇదీ క్రొత్త

విషయమేమీ కాదు. పూర్వ కాలములో కూడా గురువు తన వద్ద నేర్చుకోవలసినది నేర్చుకున్నాక, తన శిష్యులకు వేరొక గురువును ఆశ్రయించమని తెలియజేస్తూ, ఆ గురువుకు తన శిష్యుని గురించి తెలియజేస్తూ Recommendation Letter ఇచ్చేవారు. నేడు భారతదేశములో ఐ.ఐ.టి. లో విద్య పూర్తయిన తరువాత వారు విదేశాలలో విద్యను కొనసాగించే నిమిత్తము, ఐ. ఐ. టి. ప్రొఫెసర్ ల వద్దనుండి Letter of Recommendation తీసుకోవడం ఆనవాయితీ. ఇక దక్షిణ విషయానికి వస్తే అది శిష్యుడు గురువుకు విద్యానంతరము ఇచ్చే కానుక(గురుదక్షిణ)గా నుండేది. ఇది గురువును బట్టి, శిష్యుడి నేర్చుకున్నదాన్ని బట్టి మారుతూ ఉండేది. కొంత మంది శిష్యులు ధనరూపేణ గురుదక్షిణ చెల్లిస్తే, మరికొంత మంది గురువుగారికి వారికి ప్రియమైన వస్తువులను ఇచ్చి గురుదక్షిణ చెల్లించేవారు. శ్రీకృష్ణుడు సాందీపని మహర్షికి, మరణించిన అతని కుమారుని యమధర్మరాజు నుండి విడిపించి గురుదక్షిణగా సమర్పించాడు. అర్జునుడు ద్రుపదుని బంధించి ద్రోణాచార్యునికి గురుదక్షిణగా సమర్పించాడు. ఏకలవ్యుడు తన కుడిచేతి బొటనవ్రేలిని గురుదక్షిణగా సమర్పించాడు. కాని ఆ కాలములో గురుదక్షిణ ఆశించి చదువు చెప్పేవారు కాదు. అలాగే పెద్దల సందర్శనకు వెళ్ళేటప్పుడు ఫలం, పుష్పం ఏదైనా తీసుకొనివెళ్ళేవారు. అది మర్యాద. అతిథిని సత్కరించినపుడు దక్షిణ, తాంబూలములతో ఆనందింపజేసేవారు. అది కూడా మర్యాద. నేడు అది మర్యాదగా కాకుండా, బాధ్యతగా మారింది. ఉత్తర, దక్షిణలు లేకపోతే అధికారుల దర్శనభాగ్యము కూడా కరువే. చివరకు తిరుమలలో గది కావాలన్నా ఇవి అవసరం (నన్ను నమ్మండి, తిరుమలేశునికి కూడా తిప్పలు తప్పవు!). ఇదంతా కాలానుగుణమైన మార్పు. కావున, ఉత్తర దక్షిణలు లేకుండా మన మనుగడ ప్రశ్నార్థకము కదా! కాదంటారా?

కాదని కలియుగములో కృతయుగధర్మాలని పట్టుకుని ప్రాకులాడితే, మనుగడ కష్టం. భగవంతుడే ఈ కలియుగమానవుని ముందు నిలువలేక శిలారూపం ధరించాడని అంటారు. షిర్డీ సాయిబాబా భజనలు చేసేటప్పుడు కూడా దక్షిణ సమర్పిస్తారు. అవి ఏవైనా రెండు నాణెములు (నయాపైసాలైనా సరే). అవి శ్రద్ధ, నమ్మకమునకు ప్రతీకలు. ఏది ఏమైనా నేడు అవినీతిని ఆశ్రయిస్తున్నవారు దక్షిణకోసం ప్రదక్షణం చేసే బదులు దేవునిచుట్టూ ప్రదక్షణ చేస్తే కాస్త పుణ్యమైనా వస్తుందేమో కదా!

## మానావలోకనము

అభిమానం లోనూ మానం ఉంది.
అవమానం లోనూ మానం ఉంది.
కాని ఈ మానాల (పరువుకు సంబంధించినది) మానం (కొలత) ఒక పరిధిని దాటకూడదు.
అది తెలిసినా మనం అభిమానం, అవమానం లాంటి రాగ ద్వేషాలను మానం (వదులుకోము).